నిలువ నీడలేదు..


హైదర్‌గూడ చౌరస్తాలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ఎండలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

- ఆర్టీసీ బస్టాప్స్‌లో షెల్టర్లు కరువు
- ఎండలోనే బస్సుల కోసం ఎదురుచూపులు

అత్తాపూర్: ప్రయాణికుల సౌకర్యార్థ కోసం ఏర్పాటు చేసిన బస్టాప్‌లలో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు బస్సు వచ్చేంత వరకు బస్టాప్‌ల్లో నిలబడాల్సిన పరిస్థితి. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న బస్టాపుల్లో 90శాతానికి పైగా ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేయకపోవడంతో రాష్ట్ర రోడ్డు రవాణా శాఖతో పాటు జీహెచ్‌ఎంసీ అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. నిత్యం వందలాది మంది ప్రయాణించే ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాప్‌ల్లో మహిళా ప్రయాణికుల కోసం బాత్‌రూమ్ ఫెసిలిటీ కల్పించాలని పలువురు ప్రయాణికులు సూచిస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి

బస్టాప్‌లోనే ప్రైవేటు వాహనాలు, ఆటోవాలాలు తిష్ట వేయడంతో ప్రయాణికులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ అధికారులతో పాటు ట్రాఫిక్ పోలీసులు కూడా నిర్వహించాలని ప్రయాణికులు కోరుతున్నారు. హైదర్‌గూడ, అత్తాపూర్, శివరాంపల్లి, ఉప్పర్‌పల్లి చౌరస్తా బస్టాపుల్లో యుద్ధప్రతిపాదికన బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. బస్టాపులు మత్రమే ఏర్పాటు చేయడం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చూసుకుంటుందని... ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయడం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చూస్తుందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. నగరాభివృద్ధి కోసం ఆస్తిపన్నులు వసూలు చేస్తున్న జీహెచ్‌ఎంసీ పట్టించుకోకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ మున్సిపల్ పరిధిలో 90 శాతంపైగా ట్యాక్స్ వసూలు అయ్యింది. ప్రజలకు అభినందనలు తెలపడంతో పాటు బస్టాప్‌లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండలో వేచి ఉంటున్నాం..



ఓ వైపు ఎండలు మరో వైపు వడగాల్పులతో ప్రయాణికులు ఇబ్బందులకు గురరవుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సు కోసం ఎదురు చూడడానికి చాలా చోట్ల బస్‌షెల్టర్లు లేవు. నిలువ నీడ లేక ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు చెట్లను, దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు.

– రాచూరి రాజశేఖర్, హైదర్‌గూడ

మే 7 నుంచి జియాగూడ రంగనాథ స్వామి ఉత్సవాలు

జియాగూడ: జియాగూడ రంగనాథస్వామి దేవస్థానంలో మూల విరాట్‌ల పునర్ ప్రతిష్ఠాపన ఉత్సవాలు మే 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధి శేషాచార్యులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల ప్రారంభించిన ఆలయ పునరుద్ధరణ పనులు, నిర్మాణ పనులు, జీరనోద్ధరణ నేపథ్యంలో గర్భాలయంలోని మూల మూర్తుల దర్శనాన్ని నిలి తాత్కాలికంగా నిలిపి వేసి ప్రాంగణంలో బాలాలయాన్ని ఏర్పాటు చేసి శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ, అలివేలు మంగ హనుమంతుడు, అల్వారు ఉత్సవ మూర్తులను భక్తుల దర్శనార్థం ప్రతిష్ఠించారు. మే 9 నుంచి తిరిగి దర్శన సదుపాయం గర్భాలయంలో ప్రారంభిస్తామని తెలిపారు.

గోల్కొండ ఆసుపత్రిలో రూ.5 భోజనానికి విశేష స్పందన

గోల్కొండ: స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో కొనసాగుతున్న రూ.5 భోజన పథకానికి విశేష స్పందన వస్తుంది. ఆసుపత్రికి వచ్చే ఔట్‌పేషంట్లు, రోగుల సంఖ్య పెరగడంతో పాటు ఇన్‌పేషంట్ల బెడ్ల సంఖ్య పెరగడంతో ఇన్‌పేషంట్ల సహాయకుల సంఖ్య కూడా బాగా పెరిగింది. దీనికి తోడు ఈ ఆసుపత్రికి కార్వాన్, గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, షేక్‌పేట్ తదితర ప్రాంతాల నుంచి పేషంట్లు వస్తుంటారు. పేద బడుగు వర్గాలకు చెందిన వారికి ఈ భోజన పథకం వరంలా మారింది. ఉదయం ఇడ్లీ, ఉప్మా, మధ్యాహ్నం భోజనం మళ్లీ, రాత్రి భోజనం కూడా రూ.5కే ఇస్తుండడంతో వచ్చిన భోజనం వచ్చినట్లుగానే అయిపోతుంది. బ్రేక్‌ఫాస్ట్, లంచ్ కోసం పంపే భోజన పదార్థాల సంఖ్యను పెంచమని కోరామని ఆసుపత్రి మెడికల్ సూపరిండెంటెంట్ డాక్టర్ పీవీ శ్రీనివాసరావు 'సాక్షి'తో అన్నారు. ఉదయం కొద్ది సేపట్లోనే అయిపోతుందని గత్యంతరం లేక పేషంట్ల సహాయకులు బయట నుంచి తెప్పించుకుంటున్నారన్నారు.

'యాదవ సంఘం స్థలాన్ని కాపాడుకుంటాం'

గోల్కొండ: కార్వాన్ యాదవ సంఘానికి చెందిన స్థలాన్ని కొందరు కబ్జాదారులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని సంఘం ప్రతినిధులు ఆరోపించారు. మూడు దశాబ్దాల క్రితం ఈ స్థలం కార్వాన్ యాదవ సంఘానికి కేటాయించడం జరిగిందని, గత కొన్ని రోజుల క్రితం ఈ స్థలంలో ఈ జాగా మాది అంటూ కొందరు కబ్జాదారులు కరెంటు మీటర్ ఏర్పాటు చేశారన్నారు. దీంతో మంగళవారం కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బొడి అశోక్‌కుమార్‌యాదవ్, సంఘం సభ్యులతో మెహిదీపట్నం విద్యుత్ శాఖ ఏడీఈ గణేష్‌ను కలిశారు. ఈ స్థలంలో మీటర్ ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి ఎలా ఇచ్చారు, దరఖాస్తు చేసుకునే వ్యక్తి స్థలానికి చెందిన డాక్యూమెంట్లు సమర్పించాడా అని ఏడీఈని అడిగారు. వెంటనే ఆ మీటర్‌ను తొలగించాలని ఆయన కోరారు.

పాలిటెక్నిక్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

శాలిబండ: చందులాల్ బారాదరిలోని కులీ కుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందుబాటులో వివిధ కోర్సులను పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.పరమేశ్వరి, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ వి.వంశీ విక్రమ్ తెలిపారు. కులీ కుతుబ్‌షా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రిషియన్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్‌తో పాటు రాష్ట్రంలో ఉన్న ఏకైక డిప్లొమా ఇన్ ప్రింటింగ్ టెక్నాలజీ కోర్సు ఇక్కడ అందుబాటులో ఉందన్నారు. ఈ అవకాశాన్ని పదో తరగతి పూర్తి చేసుకున్న పాలిసెట్ అర్హత సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించండి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ గోపీనగర్‌లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ మంగళవారం పర్యటించారు. దర్గా, చర్చి బస్తీల్లో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే రోడ్ల నిర్మాణం చేపట్టాలని వాటర్‌వర్క్స్, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ భాస్కర్, వాటర్ వర్క్స్' మేనేజర్ అభిషేక్‌రెడ్డి, ఎలక్ట్రిక్ ఏఈ వెంకట్‌రామ్‌రెడ్డి, నాయకులు యాదాగౌడ్, దస్తగిరి, రవి,గఫూర్, అశోక్, రజాక్, ఖాజా, నాని, బాలస్వామి, చంద్రమౌళి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


గోపీనగర్‌లో డ్రైనేజీ సమస్యను కార్పొరేటర్‌కు చూపిస్తున్న స్థానికులు

మైలార్‌దేవ్‌పల్లిని ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నాం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లిని ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నామని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం దుర్గానగర్ కాలనీలో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా నూతనంగా వేయాల్సిన సీసీ రోడ్డు పనులపై అధికారులతో సమీక్షించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ..అధికారులు త్వరగా పనులు ప్రారంభించాలన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు కాంట్రాక్టర్‌లతో మాట్లాడి పనులను చేపటేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నర్సింహ్మమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, సురేందర్‌రెడ్డి, బబ్లూ, జనార్దన్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రావణ్, శంకర్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్, కాంట్రాక్టర్ నాయక్ పాల్గొన్నారు.


దుర్గానగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

జూన్ 26 నుంచి కోట బోనాలు

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలు జూన్ 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని గోల్కొండ జగదాంబిక మహంకాళి వృత్తిపని సంఘం వారి మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి తెలిపారు. కోట బోనాల్లో అమ్మవారికి మొత్తం తొమ్మిది పూజలు జరుగుతాయని ఇందులో భాగంగా జూన్ 26న మొదటి పూజ, 29న రెండో పూజ, జూలై 3న మూడో పూజ, 6న నాల్గొవ పూజ ఉంటుందన్నారు. అదే విధంగా 10న ఐదో పూజ, 13న ఆరో పూజ, 17న ఏడో పూజ, 20న ఎనిమిదవ పూజ జరుగుతుందని తెలిపారు. 24న తొమ్మిదవ పూజ ఉంటుందని పేర్కొన్నారు.

సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్క్‌ను సందర్శించిన కమిషనర్


కొత్వాల్‌గూడలోని డీఆర్‌సీసీను సందర్శించి పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు సాలీడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పార్క్‌ను మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర సందర్శించారు. కొత్వాల్‌గూడలోని డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్, కంపోస్టు తయారీ ప్రక్రియను పరిశీలించారు. ప్రతి ఇంట్లో నుంచి సేకరించిన రోజువారి చెత్తలో వచ్చిన పొడి చెత్తను రీసైకిల్ చేసి రీ యూస్ చేయాలని, తడి చెత్తతో కంపోస్టు తయారీ చేసి మొక్కలకు సేంద్రియ ఎరువుగా ఉపయోగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు నరేందర్, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ ప్రారంభం

మణికొండ: కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లో రూ.2.93 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే తమ లక్ష్యమన్నారు. నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రజలందరికీ ఉపయోగపడేలా చూసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్సింగి అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ కోట వేణుగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ తలారి మల్లేష్, కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, డీఈఈ నరేష్‌కుమార్, ఏఈ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఖానాపూర్‌లో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి


పోటీల్లో విద్యార్థులు, అధ్యాపకులు

మణికొండ: మహాత్మా గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో డ్రగ్స్‌పై అవగాహన పోటీలను నిర్వహించారు. డ్రగ్స్, వాటి దుష్పరిమాణాలు అనే అంశంపై వ్యాసరచన, నినాద(స్లోగన్) రచన, పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..చక్కని వాతావరణంలో విద్యను అభ్యసించి జీవిత పురోగమనాన్ని సాధించాలని అంతేగాని చెడు వ్యసనాలకు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.పి.సింగ్, వీరభద్ర, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తున్న వ్యాపారులకు చలాన్లు

రాజేంద్రనగర్: రోడ్లపై చెత్త వేస్తున్న వ్యాపారస్తులను గుర్తించి జీహెచ్‌ఎంసీ అధికారులు చలాన్లను విధిస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మూడు రోజులుగా దాదాపు 62 మందికి చలాన్లను విధించారు. రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సర్కిల్ పరిధిలోని వ్యాపారస్తులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. డివిజన్లు, వార్డుల వారీగా వ్యాపారస్తులకు ఈ సమావేశాలల్లో చెత్తను తమ వద్దకు వచ్చే చెత్త సేకరణదారునికి అందించాలని సూచించారు. ఇదే విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. సమావేశాలు, ప్రచారాల అనంతరం మూడు రోజులుగా రోడ్లపై చెత్త వేస్తున్న వ్యాపారస్తులను గుర్తించారు. వారికి రూ.1000ల నుంచి రూ.10 వేల వరకు జరిమానాలు విధిస్తున్నారు.

మూడు రోజుల్లో 62 మందికి చలాన్లు విధించి డబ్బులు వసూలు చేశారు. మరోసారి చెత్తను రోడ్లపై వేస్తే రెండింతలు అదనంగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. చలాన్లు విధిస్తుండటంతో వ్యాపారస్తులు అప్రమత్తమై తమ వద్ద డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. గతంలో జీహెచ్‌ఎంసీ విస్తృతంగా ప్రచారం చేసిన సమయంలో కొందరు డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసుకోగా..మరికొందరు పట్టించుకోలేదు. ప్రస్తుతం భారీ మొత్తంలో చలాన్లు విధిస్తుండటంతో డస్ట్‌బిన్లను ఏర్పాటు చేసుకుంటున్నారు.

ఆస్తిపన్ను రాయితీని సద్వినియోగం చేసుకోండి

రాజేంద్రనగర్: ఆస్తిపన్నుపై రాయితీకి బుధవారం చివరి రోజు అని.. చెల్లింపుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ ప్రజలను కోరారు. రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, శాస్త్రిపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు బుధవారం అర్ధరాత్రి వరకు తమ పన్నులను ఆన్‌లైన్ ద్వారా లేదా బిల్లు కలెక్టర్లకు చెల్లించాలన్నారు. సర్కిల్ కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ..ఎర్లీ బర్డ్ స్కీమ్ కోసం తాము ఇచ్చిన పిలుపునకు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ఈ పథకం ద్వారా రూ.19 కోట్లను వసూలు చేశామన్నారు. బుధవారం చివరి రోజు నేపథ్యంలో చెల్లింపుదారులు తమ పన్నులను చెల్లించాలని కోరారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



బండ్లగూడ: అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని సెయింట్ మైఖేల్ కాలనీలో పార్కు స్థలంలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీవో జి.వాణి, సీనియర్ అసిస్టెంట్లు బి.శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉర్సు ఉత్సవాలు

గోల్కొండ: హకీంపేట్‌లోని హజ్రత్ సయ్యద్ నిజాముద్దీన్ అహ్మద్ జిలానీ హకీంషా బాబా దర్గాలో ఉర్సు ఉత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ పూల ఛాదర్, దట్టీ సమర్పించారు. ఆయన వెంట దర్గా నిర్వహణ కమిటీ ప్రతినిధులు, ఉర్సు కమిటీ ప్రతినిధులు, నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, సీనియర్ మజ్లీస్ నాయకులు హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి సెక్టార్‌లోని బాబుల్‌రెడ్డినగర్ అంగన్‌వాడీ సెంటర్–2లో టీచర్ అనిత ఆధ్వర్యంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ, పోషన్ ట్రాకర్ రూప, నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొంపల్లి జగదీష్, సాంస్కృతిక కార్యదర్శి గోంత్యాల శ్రీనివాస్, హేమలత హాజరయ్యారు. గ్రాడ్యుయేషన్‌ను ముగించిన ఐదేళ్లలోపు చిన్నారులకు ప్రొగ్రెస్ కార్డులు అందజేసి వీరిని ప్రాథమిక పాఠశాలలో చేర్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని టీచర్ అనిత పేర్కొన్నారు. సీడీపీవో కవిత మాట్లాడుతూ..చిన్నారుల విద్యారంభానికి ఇదోక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, మాధవి, రత్న, సంగీత తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు ప్రొగ్రెస్ కార్డులు అందజేస్తున్న దృశ్యం

విద్యార్థి నాయకుల ముందస్తు అరెస్ట్

రాజేంద్రనగర్: రాష్ట్ర విద్యార్థి బీసీ సంఘం ఇచ్చిన నిరసన కార్యక్రమం నేపథ్యంలో పోలీసులు ముందు జాగ్రత్తగా విద్యార్థి నాయకులను మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. రాజేంద్రనగర్ పోలీసులు రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ నివాసానికి చేరుకొని తెల్లవారు జామున 5 గంటలకు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు విద్యార్థి నాయకులను ముందు జాగ్రత్తగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ..రాష్ట్రంలోని 14 లక్షల 75 వేల మంది విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రస్తుతం పరీక్షల నేపథ్యంలో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు అష్ట కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బడా కాంట్రాక్టర్లతో పాటు మూసీ సుందరీకరణ అందాల పోటీలకు డబ్బులు ఖర్చు చేస్తుంది కానీ విద్యార్థులకు ఇవ్వాల్సిన రూ.7500 కోట్ల బకాయిలను చెల్లించడం లేదన్నారు. తాము విద్యార్థులకు రావాల్సిన బకాయిలను కోరుతూ నిరసన వ్యక్తం చేద్దామని పిలుపునిస్తే ముందు జాగ్రత్తగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థుల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు.


వేముల రామకృష్ణను అరెస్ట్ చేసిన పోలీసులు

ఆధార్ కార్డులను పరిశీలించి అనుమతించాలి


వేముల మల్లేష్

రాజేంద్రనగర్: వాణిజ్య సముదాయాలు, మాల్స్‌తో పాటు ఆలయాలలోకి వచ్చే ప్రజల ఆధార్ కార్డులను తప్పనిసరిగా పరిశీలించి అనుమతించాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి వేముల మల్లేష్ ప్రభుత్వాన్ని కోరారు. బండ్లగూడ ఆరె మైసమ్మ ఆలయంలోకి వచ్చే భక్తులకు ఆర్మీ అధికారులు ఆధార్ కార్డును తప్పనిసరి చేశారని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం, పోలీసులు ఈ విషయంలో ఆలోచించాల్సిన అవసరముందన్నారు. ఆరె మైసమ్మ ఆలయాన్ని ప్రతిరోజు వేలాది మంది దర్శిస్తుంటారన్నారు. ఈ ఆలయాన్ని పూర్తిగా ఆర్మీ అధికారులు, సిబ్బంది పర్యవేక్షిస్తారన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నేపథ్యంలో ఆర్మీ అధికారులు ఆలయానికి వచ్చే భక్తులకు ఆధార్‌ను తప్పనిసరి చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు పోలీసు శాఖ ఈ విషయాన్ని గమనించి మాల్స్, వాణిజ్య కేంద్రాలు, ఆలయాల వద్ద ఆధార్‌ను తప్పనిసరి చేయాలన్నారు. ఈ విషయమై త్వరలో పోలీసు డీజీపీతో పాటు ముఖ్యమంత్రికి లేఖ రాయనున్నట్లు తెలిపారు.

'కేంద్రీయ విద్యాలయాలు ప్రతిభకు నిలయాలు'

గోల్కొండ: ప్రధానమంత్రి కేంద్రీయ విద్యాలయాలు ప్రతిభకు నిలయాలు అని ఆర్టిలరీ సెంటర్ బ్రిగేడియర్ రాహుల్ తాప్రియాల్ అన్నారు. కేంద్రీయ విద్యాలయ–1 గోల్కొండలో విద్యాలయాల రీజినల్ అథ్లెటిక్ స్పోర్ట్స్ మీట్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆయనకు మొక్కను అందించి స్వాగతం పలికారు. చదువుతో పాటు వివిధ క్రీడాంశాల్లో సైతం విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వబడుతుందని ఆయన అన్నారు. ఈ కారణంగానే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో కేంద్రీయ విద్యాలయాల విద్యార్థులే పతకాలు సాధిస్తారన్నారు. అండర్–17 మూడు వేల మీటర్ల రేస్‌లో సహస్రా శెట్టి, విజయవాడ కేంద్రీయ విద్యాలయానికి చెందిన వినీత్ అండర్–17లో బంగారు పతకాలు సాధించారు. అదే విధంగా అండర్–19 బాలికల 300 మీటర్ల రేస్‌లో విజయనగరం కేంద్రీయ విద్యాలయానికి చెందిన సునీత బంగారు పతకాన్ని సాధించింది. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


బ్రిగేడియర్ రాహుల్ తాప్రియాల్‌కు మొక్కను అందజేస్తున్న విద్యార్థులు

జానపద సాహిత్యం కొత్త పుంతలు తొక్కింది

రాయదుర్గం: జానపద సాహిత్యం 70 ఏళ్లలో అనేక మలుపులు తిరిగిందని ద్రవిడ విశ్వవిద్యాలయం జానపద అధ్యయన శాఖ పూర్వ పీఠాధిపతి ఆచార్య పులికొండ సుబ్బాచారి పేర్కొన్నారు.ఆచార్య బిరుదురాజు రామరాజు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగు శాఖ మంగళవారం రామరాజు సాహిత్య పరిశోధనపై సదస్సు నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన తెలుగుశాఖ హెచ్‌సీయూ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ జానపద సాహిత్య అధ్యయనానికి బిరుదురాజు రామరాజు పరిశోధనా కృషియే పునాది అని పేర్కొన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి గౌరీశంకర్ మాట్లాడుతూ అనేకమంది పరిశోధకులను ప్రోత్సహించిన ఉదాత్త వ్యక్తిత్వం రామరాజుగారిదన్నారు. తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బిరుదురాజు రామరాజు రచించిన ఆంధ్రయోగులు గురించి మాట్లాడారు. భారతీయ ఆధ్యాత్మిక కృషిని ఆ గ్రంథంలో వివరించారని ఆయన సోదాహరణంగా పేర్కొన్నారు. బిరుదురాజురామరాజు తెలుగులో జానపద గేయ సాహిత్యంలోని వివిధ అంశాలను డాక్టర్ డి విజయకుమారి తన పత్రసమర్పణలో పేర్కొన్నారు. అనంతరం సమావేశంలో పాల్గొన్న వారిని ఘనంగా సత్కరించారు. శాస్త్రవేత్త డాక్టర్ రూప్‌కుమార్, ఆచార్యులు డి విజయలక్ష్మి,పమ్మిపవన్‌కుమార్, వంగరిత్రివేణి, డాక్టర్ భూక్య తిరుపతి, డాక్టర్ భుజంగరెడ్డి, డాక్టర్ విజయకుమార్,పరిశోధక,సాహితీ విద్యార్థులు పాల్గొన్నారు.


అతిథులను సత్కరించిన సదస్సు నిర్వాహకులు